ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

జాతీయ వార్తలు

తేదీ: 08.11.2024 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. మూసీ పునరుజ్జీవ సంకల్పంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు పాదయాత్ర చేపట్టనున్నారు.
2. దేశం యావత్తూ కుల గణన సర్వేకు తెలంగాణను ఆదర్శంగా తీసుకునేలా ప్రభుత్వం సర్వే నిర్వహిస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు.
3. విశ్వకర్మ పథకం లక్ష్యాలకు అనుగుణంగా అమలుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి G కిషన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.
4. న్యాయసేవా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత న్యాయసేవలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

------------------------------

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

మూసీ పునరుజ్జీవన సంకల్పంలో భాగంగా నది ఒడ్డున సంగెం నుంచి భీమలింగం వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు పాదయాత్ర చేస్తారు. ఈ ఉదయం హైదరాబాద్ నుంచి హెలికాప్టర్లో బయలుదేరిన ముఖ్యమంత్రి ప్రముఖ పుణ్యక్షేత్రం

యాదగిరిగుట్ట చేరుకున్నారు. అనంతరం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. కొండపై నిర్వహించిన అఖండ దీపారాధనలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రికి అర్చకులు ఆశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకు ముందు ముఖ్యమంత్రికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా యాదగిరి గుట్ట ఆలయ అభివృద్ధి అథారిటీ, ఆలయ అభివృద్ధి పనులపై ముఖ్య మంత్రి సమీక్ష చేస్తారు. అనంతరం జిల్లాలోని సంగెం నుంచి భీమలింగం వరకు దాదాపు 2.5 కిలో మీటర్ల మేర పాదయాత్ర చేస్తారు. అక్కడి నుంచి తిరిగి ధర్మారెడ్డిపల్లి కెనాల్ కట్ట వెంట సంగెం - నాగిరెడ్డిపల్లి రోడ్డు వరకు పాదయాత్ర చేస్తారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో మూసీ పునరుజ్జీవ సంకల్ప రథంపై నుంచి రైతులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. అనంతరం హైదరాబాద్ తిరుగు ప్రయాణమవుతారు. యాద్దారి టెంపుల్ డెవలప్ మెంట్ అథారిటీ అధికారులతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహిస్తారు.

**యాదాద్రి భువనగిరి**

-------------------------------

**ముందస్తు అరెస్టులు**

కాగ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ముందస్తు అరెస్టులు జరిగాయి. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో ఏర్పాటు చేయబోతున్న ఓ సిమెంట్ పరిశ్రమకు వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్నవారు ముఖ్యమంత్రి

పర్యటనను అడ్డుకుంటారనే సమాచారంతో ముందు జాగ్రత్తగా బీఆర్ఎస్ నేతలు, ప్రజాసంఘాల నేతలను అరెస్టు చేశారు.

**పీ టీ సీ యాదాద్రి భువనగిరి**

--------------------------------

**కులగణన-పొంగులేటి**

దేశం యావత్తూ కుల గణన సర్వేకు  తెలంగాణను ఆదర్శంగా తీసుకునే విధంగా పకడ్బందీగా ప్రభుత్వం సర్వే నిర్వహిస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఈరోజు ఖమ్మం జిల్లాలోని నారాయణపురం గ్రామంలో జరుగుతున్న కులగణన సర్వేని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని రకాలుగా ఉపయోగపడే విధంగా ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. సర్వే పూర్తయిన అనంతరం అన్ని వివరాలను ఆన్లైన్ లో నమోదు చేస్తామన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా నిష్పక్షపాతంగా సర్వే నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి ఉద్యోగికి 170 ఇళ్ళు కేటాయించి క్షుణంగా సర్వే నిర్వహించే విధంగా తర్ఫీదు ఇచ్చామన్నారు. అనంతరం వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు.

**పీటీసీ, ఖమ్మం**

-----------------------------

**కుటుంబ సర్వే**

రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా కుటుంబాల జాబితా తయారీ, ఇంటింటికీ స్టిక్కర్లు వేసే తొలి దశ కార్యక్రమం ఈ రోజుతో పూర్తవుతుంది. ఈ దశలో కుటుంబ యజమాని పేరు, ప్రాథమిక వివరాలు తీసుకొని సర్వే ఫారంలో నమోదు చేస్తున్నారు. అవే వివరాలను స్టిక్కర్ పై రాసి ఇంటి గోడకు అతికిస్తున్నారు. రేపటి నుంచి సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమవుతుంది. సర్వే నిమిత్తం ఎన్యూమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు అందుబాటులో ఉండాలని అధికారులు సూచించారు. ఆధార్ తో సహా, ఇతర గుర్తింపు పత్రాలు, వివరాలు అందుబాటులో ఉంచుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ నెల ఆరు నుంచి మొదలైన కుటుంబ సర్వే ఈ నెలాఖరు వరకు కొనసాగుతుంది.

డెస్క్

--------------------------------

**దిశ సమావేశం- కిషన్ రెడ్డి**

విశ్వకర్మ పథకం అమలుపై అధికారులు దృష్టి సారించాలని, వచ్చే 45 రోజుల్లో పథకాన్ని పూర్తి స్థాయిలో అమలుచేయాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి G కిషన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. విశ్వకర్మ పథకం లక్ష్యాలకు అనుగుణంగా అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హైదరాబాద్ లో ఈ ఉదయం జరిగిన దిశ కమిటీ సమావేశంలో ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అధికారుల నిర్లక్ష్యం కారణంగా విశ్వకర్మ పథకం లక్ష్యం నీరుగారిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పథకంకింద 18 వేల దరఖాస్తులు అందితే, కేవలం ఆరు వందలమంది లబ్దిదారులకు మాత్రమే పథకం

మంజూరయిందని పేర్కొన్నారు. వచ్చే 45 రోజుల్లో కార్యక్రమాన్ని పూర్తి చేయకపోతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. సాంకేతిక సమస్యల పేరుతో పథకం అమలులో జాప్యం చేయవద్దని సూచించారు. GHMC పరిధిలో స్వచ్ఛ భారత్ లో భాగంగా మరుగుదొడ్ల నిర్వహణలో లోపాలున్నాయని మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు.

**-MSL**

----------------------------

**ముఖ్యమంత్రి జన్మదినం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధానమంత్రికి ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు. గాంధీభవన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కూడా ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

**DESK**

----------------------------

**పొంగులేటి**

అర్హులందరికీ త్వరలోనే ప్రభుత్వం రైతు భరోసాను అందిస్తుందని, ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నిన్న సాయంత్రం వరంగల్ జిల్లాలో 52.34 కోట్ల రూపాయలతో చేపట్టే అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో రాయపర్తి మండలంలోని పెరికేడు గ్రామం నుండి అన్నారం షరీఫ్ వరకు 7 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించే రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అమృత్ 2.0 పథకం కింద 34.08 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న వర్ధన్నపేట మంచినీటి సరఫరా ప్రాజెక్ట్ పనులను ప్రారంభించారు. CSR నిధులతో చేపట్టనున్న వర్ధన్నపేట CHC ఆసుపత్రి అభివృద్ధి పనులను కూడా మంత్రి ప్రారంభించారు.

**పీటీసీ, వరంగల్ జిల్లా**

----------------------------

**డీఎస్ చౌహాన్**

కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని ఆరబెట్టుకుని తీసుకురావాలని రైతులకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డి.ఎస్.చౌహాన్ సూచించారు. నిన్న రాత్రి కామారెడ్డి జిల్లా బిక్కనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. యార్డులో ఆరబెట్టిన ధాన్యం తేమశాతం 40 కి పైగా ఉండడం గమనించిన ఆయన ఈ సూచన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మంచి నాణ్యత కలిగిన తెలంగాణ బియ్యం- పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయని తెలిపారు.

ఎలాంటి అపోహలు లేకుండా వరి ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావాలని రైతులను కోరారు.

**పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా**

-------------------------

**న్యాయ సేవల దినోత్సవం**

న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉచిత న్యాయసేవల వినియోగంపై రాష్ట్ర వ్యాప్తంగా వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జిల్లా కోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి న్యాయవాదిని నియమించుకోలేని నిరుపేదలు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రక్రియ ద్వారా అందించే ఉచిత న్యాయవాద సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయమూర్తులు సూచించారు. కక్షిదారులు సమన్వయంతో వ్యవహరించి రాజీమార్గం ద్వారా అన్ని కేసులను పరిష్కరించుకోవాలని కోరారు.

న్యాయసేవాదికార సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయసేవలను ప్రజలు సద్వినియోగం చేయనుకోవాలని వనపర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ ఎం.అర్ సునీత అన్నారు. ఈరోజు వనపర్తి జిల్లా కేంద్రంలో జాతీయ న్యాయ సేవల దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన అవగాహనా ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్బంగా సునీత మాట్లాడుతూ ఎలాంటి తారతమ్యం

లేకుండా ప్రతి పౌరుడికి న్యాయ సేవలు అందాలని, ఉచిత న్యాయసేవలను వినియోగించుకోవాలని సూచించారు.

**పిటిసి, వనపర్తి, మహబూబాబాద్**

-----------------------------------

**భద్రకాళి చెరువు**

వరంగల్ నగరంలో ఉన్న భద్రకాళి చెరువు ప్రక్షాళన పనులలో భాగంగా చెరువులో ఉన్న నీటిని నాగారం చెరువులోకి పంపి నీటిని పూర్తిగా తొలగించడానికి అధికారులు నేడు పనులకు శ్రీకారం చుట్టారు. అయితే పనులు ప్రారంభించిన కొద్దిసేపటికే మత్స్యకారులు వారిని అడ్డుకోవడంతో నిలిచిపోయాయి. ఉన్న పళంగా చెరువులో నీటిని తీసివేస్తే తాము ఉపాధి కోల్పోతామని, చెరువులో చేపల వేట మీద ఆధారపడిన మత్స్యకారులు ఆందోళన చేశారు. తమకు ప్రత్యామ్నాయం చూపించిన తర్వాత చెరువులో నీటిని తొలగించాలని డిమాండ్ చేశారు.

**వరంగల్ జిల్లా పి టి సి**

-----------------------------

**ఆదివాసీ మొబైల్ కనెక్టివిటీ**

గ్రామీణ ప్రాంతాలకు మొబైల్ కనెక్టివిటీ పెంచే విధంగా టవర్‌ల నిర్మాణం చేపట్టాలన్న కేంద్రం నిర్ణయంతో ఆసిఫాబాద్ జిల్లాలో ఆదివాసి మండలాల్లో మొబైల్ కనెక్టివిటీ పెరగనుంది. జిల్లాలోని తిర్యాని, సిర్పూర్ (యు), కెరమెరి, లింగాపూర్, జైనూర్, బెజ్జూర్, వాంకిడి మండలాల్లో దాదాపు 100కు పైగా గ్రామాల్లో

నేటికి మొబైల్ నెట్వర్క్ సౌకర్యం లేదు. మావోయిస్టుల ప్రాబల్యాన్ని తగ్గించడానికి సెల్ ఫోన్ టవర్ల నిర్మాణం అత్యంత అవసరమని కేంద్రం భావించడంతో ఏజెన్సీ, కొండ ప్రాంతాల్లో మొబైల్ సేవలు విస్తరించనున్నాయి. ఈ అంశంపై జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే నిన్న సాయంత్రం బిఎస్ఎన్ఎల్, టీ - ఫైబర్ అధికారులతో సమావేశం నిర్వహించారు.

**ఆసిఫాబాద్ జిల్లా పిటిసి**

----------------------------------

**అక్రమ బియ్యం**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల శివారు నుంచి అక్రమంగా తరలిస్తున్న 48 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నిన్న రాత్రి స్వాధీనం చేసుకుని, వాటిని తరలించే ముఠాను అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. ఏడుగురిపై కేసు నమోదు చేసి, బియ్యం తరలిస్తున్న మినీ వ్యాన్ సీజ్ చేసినట్లు తంగళ్లపల్లి ఎస్సై ఎస్సై రాంమోహన్ తెలిపారు.

**పిటీసి, రాజన్న సిరిసిల్ల జిల్లా**

-----------------------

**ఓటరు నమోదు**

ఆసిఫాబాద్ జిల్లాలో త్వరలో జరగబోయే పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈ నెల 23 నుంచి డిసెంబర్ 9 లోపు ఓటు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే తెలిపారు. పట్టభద్రులు ఫామ్ 18, ఉపాధ్యాయులు

ఫామ్ 19 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ఓటర్ నమోదు సవరణల కోసం ఈ నెల 9, 10 తేదీల్లో జిల్లాలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు.

**ఆసిఫాబాద్ జిల్లా పిటిసి**

---------------------------------